క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మహాదేవుని ఆలయంలో మాస శివరాత్రిని పురస్కరించుకొని సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ భజన మండలి ఆధ్వర్యంలో ఉ.9గంటల నుంచి లింగాష్టక పారాయణం, మధ్యాహ్నం 12.30లకు శివలింగానికి పంచామృతంతో అభిషేకం నిర్వహించారు. దూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ధారూరు ఇన్‌చార్జి ఏఓగా జాన్సీలక్ష్మి



జాన్సీలక్ష్మిని సన్మానిస్తున్న ఏఈఓలు

ధారూరు: ధారూరు మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారిగా జాన్సీలక్ష్మి సోమవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఓ రమేశ్ సెలవుల్లో వెళ్లడంతో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో టెక్నికల్ ఏఓగా పనిచేస్తున్న జాన్సీలక్ష్మికి జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్ ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. బాధ్యతలు చేపట్టిన ఆమెను మండలంలోని ఏఈఓలు శాలువాలు కప్పి, పూల మొక్క అందజేసి సన్మానించారు.

ఓటు హక్కు నమోదుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న రెవెన్యూ అధికారులు

కుల్కచర్ల: ప్రతి ఒక్కరూ ఓటుహక్కు నమోదుపై అవగాహన కల్గి ఉండాలని రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ లింగయ్య పేర్కొన్నారు. సోమవారం చౌడాపూర్ మండలం మందిపల్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఈవీఎం ద్వారా ఓటు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీప్యాడ్లు వంటి ఎలక్ట్రానిక్ ఓటింగ్ సిస్టంపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలనే ఉద్దేశంతో గ్రామాగ్రామాన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. నూతన ఓటర్లు ఓటింగ్ సిస్టం గురించి తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రాజశేఖర్, నందు, ప్రభులింగం, పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని నిరసన



పోలీసులకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్‌ఎంలు

కొడంగల్ రూరల్ : కాంట్రాక్ట్ ఏఎస్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆల్ కాంట్రాక్ట్ ఏఎన్‌ఎం(సీఐటీయూ) అనుబంధ జిల్లా అధ్యక్షురాలు కె.లీలావతి డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుంచి ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. శాంతియుతంగా నిరసనలు తెలిపేందుకు శిబిరం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని పోలీసులకు వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో భాగంగా స్థానికంగా సెకండ్ ఏఎన్‌ఎంలు పాల్గొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య, ఏఎన్‌ఎంలు శ్రీలతా, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి నిరవధిక సమ్మె

అనంతగిరి: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సెకండ్ ఏఎన్‌ఎంలు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏఎన్‌ఎంల జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నిరవధిక సమ్మె రాష్ట్ర వ్యాప్తంగా చేస్తున్నామని చెప్పారు. గత పది రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం తీవ్ర నిరాశకు గురిచేసిందని వాపోయారు. సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి లలిత, యాదమ్మ, విజయలక్ష్మి, అమృత, పద్మ, అనంతమ్మ, సత్యమ్మ, అనిత, సుజాత, శంకరమ్మ, రైషా , పాపమ్మ తదితరులు పాల్గొన్నారు

'గృహలక్ష్మి' సర్వే షురూ

- అర్హులకే పథకం
- దరఖాస్తుల పరిశీలనలో అధికారుల బిజీబిజీ



దౌల్తాబాద్: దేశాయిపల్లి గ్రామంలో సర్వే చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

దౌల్తాబాద్: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం గృహలక్ష్మి పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ పూర్తి చేసింది. ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసేందుకు సిద్ధమైంది. ఈ నెల 12న దరఖాస్తుల గడువు ముగిసింది. మండలంలో 7553 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. దరఖాస్తుల్లో అర్హులైన వారిని గుర్తించేందుకు జిల్లా కలెక్టర్, ఎంపీడీఓ, ఏపీఎం, ఎంపీఓ, ఏపీఓ ఆధ్వర్యంలో నాలుగు బృందాలను ఏర్పాటు చేశారు. గ్రామాల్లో సోమవారం నుంచి అధికారులు దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి సర్వే చేస్తున్నారు. సర్వే ఈనెల 25లోగా పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. అర్హులైన వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. నియోజకవర్గానికి 3వేల చొప్పున, మండలానికి 500 ఇళ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు.

అర్హతలు..

- ▲ మహిళ పేరిట వచ్చిన దరఖాస్తులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.
- ▲ తెల్లరేషన్‌కార్డు కలిగి ఉండి అందులో దరఖాస్తుదారు పేరు ఉండాలి.
- ▲ దరఖాస్తుదారు కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి ఉంటే అనర్హులుగా గుర్తిస్తారు.
- ▲ దరఖాస్తుల్లో దివ్యాంగులకు 5శాతం, ఎస్సీలకు 20, ఎస్టీలకు 10, బీసీ మైనార్టీలకు 50శాతం, జనరల్ 15శాతం కేటాయిస్తారు.
- ▲ గతంలో ఇల్లు మంజూరైనా, దళితబంధు, ఇతర పథకాలు పొందితే అనర్హులు.
- ▲ సొంత స్థలం పట్టా భూమి ఉండాలి.
- ▲ శిథిలావస్థలో ఇల్లు ఉంటే ఇంటి పన్ను విద్యుత్ బిల్లు చూపించాల్సి ఉంటుంది.
- ▲ మంజూరు పత్రాలు అందిన తర్వాత ఇళ్ల నిర్మాణం ప్రారంభించవచ్చు.
- ▲ బేస్‌మెంట్ లెవల్‌లో రూ.1లక్ష, రూఫ్‌లెవల్‌లో రూ.1లక్ష, పూర్తయిన తర్వాత రూ.1లక్ష.

పెద్దేముల్‌లో..

పెద్దేముల్: గృహలక్ష్మి దరఖాస్తులను రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలిస్తున్నారు. సోమవారం రెవెన్యూ ఆర్‌ఐ రాజిరెడ్డి మండలంలోని జనగాం గ్రామానికి వెళ్లి దరఖాస్తులను పరిశీలించారు. దరఖాస్తుల పరిశీలన పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శైలజారెడ్డి

పర్సాపూర్‌లో...

కొడంగల్ రూరల్ : మండలంలోని పర్సాపూర్‌లో సోమవారం తహసీల్దార్ బి.విజయకుమార్ గృహలక్ష్మి దరఖాస్తులను పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పథకానికి సంబంధించి అర్హత, ఇతర అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు ఆరు టీంలుగా దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచు సయ్యద్ అంజద్, సర్వేయర్ మురళీ, కార్యదర్శి కల్పన, ఎంపీటీసీ గోవిందమ్మ, ఉప సర్పంచు మొగులయ్య, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

కరన్‌కోట్‌లో..

తాండూరు రూరల్: గృహలక్ష్మి పథకానికి సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభించారు. సోమవారం మండలంలోని ఓగిపూర్ , కరన్‌కోట్, చిట్టిఘనాపూర్ గ్రామాల్లో తహసీల్దార్ కె.తారాసింగ్ పర్యటించారు. ఆయన మాట్లాడుతూ.. కరన్‌కోట్‌లో- 360 , ఓగిపూర్-72, చిట్టిఘనాపూర్-42 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో దరఖాస్తు చేసుకున్న వారి ఇంటికి వెళ్లి పూర్తి వివరాలు నమోదు చేసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా రేషన్‌కార్డుతో పాటు ఓపెన్‌ప్లాట్ ఉందా లేదా అని పరిశీలిస్తున్నామని చెప్పారు.

మోమిన్‌పేటలో..

మోమిన్‌పేట: ప్రత్యేకాధికారులతో గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తామని ఎంపీడీఓ శైలజారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, ఇజీఎస్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎంపీఓ యాదగిరి, ఏపీఓ శంకర్, ఏపీఎం రాజు, ఆర్‌ఐ రాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, ఈసీ వికాస్‌లను ప్రత్యేకాధికారులుగా నియమించామన్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గృహలక్ష్మి పథకంలో దరఖాస్తు చేసుకొన్న వారి నుంచి అర్హులను ఎంపిక చేస్తామని తెలిపారు. వివక్షకు తావు లేకుండా పారదర్శకంగా దరఖాస్తుల పరిశీలన చేయడం జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శులు, ఇజీఎస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

మున్సిపల్ పరిధిలో..

కొడంగల్ : కొడంగల్ మున్సిపల్ పరిధిలో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన జోరుగా సాగుతోంది. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో భాగంగా మున్సిపల్ సిబ్బంది కాలనీల్లో పర్యటించి ఇంటింటికి వెళ్లి దరఖాస్తుదారులను కలుస్తున్నారు. అర్హతలను పరిశీలిస్తున్నారు. కార్యక్రమంలో మెప్మా సిబ్బంది ఆనందమ్మ, అన్నపూర్ణ, మున్సిపల్ ఉద్యోగులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.



పెద్దేముల్: దరఖాస్తులను పరిశీలిస్తున్న ఆర్‌ఐ రాజిరెడ్డి



కొడంగల్ రూరల్ : సర్వే చేస్తున్న తహసీల్దార్ విజయకుమార్

అనంతగిరిలో..

అనంతగిరి: గృహలక్ష్మి పథకం దరఖాస్తులను సోమవారం వికారాబాద్ మండల అధికారుల బృందం గోధుమగూడలో పరిశీలించారు. దరఖాస్తులు చేసుకున్న వారి నివాసానికి వెళ్లి సంబంధిత ధ్రువపత్రాలు, వాస్తవ పరిస్థితులను వారు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమలలో ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, ఏపీఓ శీను, పాల్గొన్నారు.

దోమలో..

దోమ : అర్హులైన వారికే గృహలక్ష్మి పథకం వర్తిస్తుందని డిప్యూటీ తహశీల్దార్ విజయేందర్ అన్నారు. సోమవారం మండలంలోని ఊటుపల్లితండాలో గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారుల ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. ఇళ్లలేని నిరుపేదల కోసమే గృహలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాల్యానాయక్, సర్పంచ్ నర్సింహులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



తాండూరు రూరల్: కరన్‌కోట్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న తహసీల్దార్ కె.తారాసింగ్



కొడంగల్ : దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది

నిబంధనల మేరకే లబ్ధిదారుల ఎంపిక

కుల్కచర్ల: గృహలక్ష్మి పథకం ఎంపికలో నోడల్ ఆఫీసర్లు నిబంధనల మేరకే ఎంపిక ప్రక్రియను నిర్వహించాలని కుల్కచర్ల తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ నాగవేణి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గృహలక్ష్మి పథకం ఎంపిక ప్రక్రియపై నోడల్ ఆపీసర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ సూచనలు, నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లోని లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పరిశీలించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ కరీం, సీనియర్ అసిస్టెంట్ రమేష్, ఏపీఎం శోభ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నోడల్ ఆఫీసర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్

డిప్యూటీ తహసీల్దార్‌కు పదోన్నతి

తాండూరు రూరల్: తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో పని చేస్తున్న డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ రావుకు పదోన్నతి లభించింది. ఇందులో భాగంగా శ్రీనివాస్‌రావును తహసీల్దార్‌గా పదోన్నతి కల్పించి గద్వాల జిల్లాకు కేటాయించారు. రెండు మూడు రోజుల్లో మరో డిప్యూటీ తహసీల్దార్ ధనుంజయ్‌కు కూడా పదోన్నతి లభించనుందని రెవెన్యూ వర్గాలు తెలిపారు.

వికారాబాద్ బరిలో ఉంటా..

డాక్టర్ ఆనంద్

అనంతగిరి: రానున్న సాధారణ ఎన్నికల్లో తాను వికారాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బరిలో ఉంటానని ప్రముఖ చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ టి. ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉద్యమ సమయంలో తాను డాక్టర్ జేఏసీ తరఫున ముందుండి పోరాడానని తెలిపారు. ఎంతో మందికి వైద్య సేవలు అందించానని చెప్పారు. గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి తనకు చివరి క్షణంలో టికెట్ మిస్ అయిందని వివరించారు. ఈ సారి తప్పకుండా సీఎం కేసీఆర్ ఆశీర్వాదాలు తనపై ఉంటాయని తనకే టికెట్ వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

పాఠశాలకు ప్రార్థనా సామగ్రి పంపిణీ

కొడంగల్ : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ప్రార్థనా సమయంలో ఉపయోగించే సామగ్రిని ఎన్‌ఆర్‌ఐ హరిప్రసాద్ వశిష్ట కుటుంబ సభ్యులు సోమవారం అందజేశారు. అదే పాఠశాలలో చదువుకొని అదే పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన హరిప్రసాద్ వశిష్ట తండ్రి దివంగత నరహరి వశిష్ట జ్ఞాపకార్థం రెండు బ్యాండ్లు, భాజా, తప్పెట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, సామాజిక కార్యకర్త మురహరి వశిష్ట చేతుల మీదుగా పాఠశాల హెడ్‌మాస్టర్ రాంరెడ్డికి అందజేశారు. కొడంగల్‌కు చెందిన హరిప్రసాద్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకొని ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రస్తుతం అమెరికా సంయుక్త రాష్ట్రాల్లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఆయన పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ తనవంతు సాయం చేస్తున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయురాలు శీలాదేవి, డీడీఎస్ జిల్లా అధ్యక్షుడు జయతీర్థాచారి, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు మునీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం కృషి



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: బీసీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని 300 మంది అర్హులైన బీసీలకు రూ.1లక్ష సాయం చెక్కులను సోమవారం పట్టణ కేంద్రంలో అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రంలో ప్రతి వర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. వెనుబడిన బీసీలు ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వం లక్ష సాయం అందజేస్తుందని తెలిపారు. అలాగే, మండలంలోని బర్కత్‌పల్లిలో గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, మేఘమాల, నాగిరెడ్డి, రాందాస్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, ప్రవీణ్‌రెడ్డి, మాజీ జిల్లా కోఆప్షన్ సభ్యుడు మీర్ మహమ్మద్‌అలీ పాల్గొన్నారు.

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలి

బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి

దోమ : గ్రామాల్లో స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఎన్కేపల్లిలో ఆజాదికా అమృత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 15ను పురస్కరించుకొని పాఠశాలలోని విద్యార్థులకు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. అనంతరం అతని కుమార్తె జన్మదిన వేడుకల సందర్భంగా విద్యార్థులకు క్యారమ్ బోర్డులు, క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాలను అధిగమించాలన్నారు. పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రాఖ్యాతలను తెచ్చేలా ఉద్యోగాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రామాంజనేయులు, ఉపాధ్యాయులు వీరేశం, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ జెండాలను అందజేస్తున్న శేరిరాంరెడ్డి

ఎమ్మెల్యే సహకారంతో అభివృద్ధి



జక్కేపల్లిలో సమావేశమైన నాయకులు

యాలాల: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామాలు పూర్తిగా అభివృద్ధి బాటలో నడుస్తున్నాయని జక్కేపల్లి గ్రామ బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గణేష్ అన్నారు. గ్రామానికి మంజూరైన రూ.50 లక్షల ఎస్‌డీఎఫ్ నిధుల కేటాయింపు, పనుల గుర్తింపు తదితర అంశాలపై గ్రామ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీకి ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో మంజూరైన నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా లక్షల నిధులు మంజూరు చేసిన ఘనత రోహిత్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకులు వెంకటయ్య, మల్లేశం, రాజు, బాలప్ప, బాలరాజు, రామకృష్ణ, లాలప్ప, శ్రీనివాస్, శ్రీకాంత్, జగన్, ఆనంద్, శేఖర్ ఉన్నారు.

రూ.6 కోట్లతో పార్కు నిర్మాణ పనులు



పనులు ప్రారంభిస్తున్న దీప, కౌన్సిలర్లు

తాండూరు టౌన్ : పట్టణంలోని ఆదర్శనగర్‌లో రూ.6 కోట్లతో పార్కు నిర్మాణ పనులకు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీప శ్రీకారం చుట్టారు. సోమవారం పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఆమె పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా దీప మాట్లాడుతూ.. ఆదర్శనగర్‌లో పార్కు నిర్మించాలని ఏళ్లుగా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని టీయూఎఫ్ఐడీసీ నిధులను కేటాయించారు. పట్టణంలోనే అతిపెద్ద పార్కుగా ఆదర్శనగర్ పార్కు రూపుదిద్దుకోనున్నట్లు చెప్పారు. సాయిపూర్, తులసీనగర్, ఆదర్శనగర్ తదితర ప్రాంతాల ప్రజలకు చేరువలో ఉంటుందని, సీనియర్ సిటిజెన్స్, మహిళలు, చిన్నారులకు కోసం ప్రత్యేక నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు పూజ, విజయాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, ముక్తార్‌నాజ్, వెంకన్నగౌడ్, సోమశేఖర్, నాయకులు రంగారావు, సంజీవరావు, సంతోష్‌గౌడ్, గుండప్ప, శ్రీధర్, నాగు పాల్గొన్నారు.

గ్రూప్‌-2 పోరాటంపై ధన్యవాదాలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నర్మద

కొడంగల్ : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి నర్మద సోమవారం హైదరాబాద్‌లోనికార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గ్రూప్‌-2 పరీక్షలను వాయిదా వేసేలా పోరాటం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలతో మమేకం కావాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో బహుజనులకు రాజ్యాధికారం వచ్చేలా కృషి చేయాలన్నారు.

పేద విద్యార్థులకు చేయూత



నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ట్రస్టు సభ్యులు

నవాబుపేట: ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు ప్రతి ఒక్కరూ చేయూత నివ్వాలని చెన్నమ్మ మెమోరియల్ ట్రస్టు చైర్మన్ రాచమల్ల సిద్దేశ్వర్ అన్నారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేడు ప్రభుత్వ బడుల్లో కేవలం ఆర్థికంగా వెనకబడిన వారి పిల్లలు మాత్రమే చదువుతున్నారన్నారు. ప్రభుత్వం సైతం వారికి నాణ్యమైన విద్యను అందిచలేకపోతుందని చెప్పారు. ఇక నుంచి పాఠశాలలో మెరీట్ విద్యార్థులకు ఆర్థిక సహాయం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పాండు, ఉపాధ్యాయులు, నాయకులు రాఘవరెడ్డి, చంద్రారెడ్డి, ఎజాయిస్‌కుమార్, ఫిరోజ్, సురేష్, ప్రేమ్ కుమార్, పరమేష్, ప్రకాశ్‌యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎన్నాళ్లీ నిరీక్షణ?

- వెలవెలబోతున్న రెవెన్యూ కార్యాలయం
- అర్డర్ విడుదలైనా విధుల్లో చేరని తహసీల్దార్
- గృహలక్ష్మి సర్వేలో డిప్యూటీ తహసీల్దార్
- భూ సమస్యలు, రిజిస్ట్రేషన్లకు ఆలస్యం
- పట్టించుకోని అధికారులు

దోమ : అధికారులు లేక తహసీల్దార్ కార్యాలయం వెలవెలబోతోంది. దీంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ఇతర పనులపై వచ్చిన రైతులు సాయంత్రం వరకు వేచి చూడాల్సి పరిస్థితి. ఈ విషయం సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు వాపోతున్నారు.

విధుల్లో చేరని తహసీల్దార్..

తహసీల్దార్ల బదిలీ ప్రక్రియను ఇటీవల ఉన్నతాధికారులు చేపట్టారు. అయితే, దోమ తహసీల్దార్‌గా పరిగిలో విధులు నిర్వహిస్తున్న రాంబాబును నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు జారీ చేసి 15 రోజులు గడిచిన దోమ రాంబాబు బాధ్యతలు చేపట్టకపోవడంతో రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పని ఒత్తిడే కారణమా?

డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విజయేందర్‌ను గృహలక్ష్మి సర్వేలో భాగంగా ఆయా గ్రామాలకు అధికారులు పంపించారు. కేవలం ఓ ఆర్‌ఐ, టైపిస్టు, ఇద్దరు కంప్యూటర్ ఆపరేటర్లు మాత్రమే కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిగా నిలిచిపోతుంది. గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలనలో ఉన్నందున రిజిస్ట్రేషన్ల పక్రియ ఆలస్యం అవుతుందని డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ చెబుతున్నారు.

సిబ్బంది కొరతతో ఇబ్బందులు..

దోమ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాటు డిప్యూటీ తహసీల్దార్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్, ఇద్దరు ఆర్‌ఐలు, టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, వీఆర్‌ఏలు విధులు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇందులో కేవలం డిప్యూటీ తహసీల్దార్, టైపిస్ట్, కంప్యూటర్ ఆపరేటర్లు, బదిలీ అయిన ఆర్‌ఐ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల వీఆర్‌ఏలను ఇతర శాఖలకు అటాచ్ చేయడం, ఓ ఆర్‌ఐ సిక్ లీవ్ పెట్టడం, మరో ఆర్‌ఐ బదిలీ అయినా రిలీవ్ కాకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నారు. సీనియర్ అసిస్టెంట్ పోస్ట్ ఖాళీగా ఉండడం, జూనియర్ అసిస్టెంట్ ఓటరు నమోదులో భాగంగా నగరంలో విధులు నిర్వహించడంతో కార్యాలయం పూర్తిగా ఖాళీ అయింది. దీంతో సిబ్బందిని నియమించేలా తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు కోరుతున్నారు.



ఖాళీగా ఉన్న తహసీల్దార్ కుర్చీ